సాక్షి
మెదక్
శనివారం । 30 । డిసెంబర్ । 2023



కల.. కళ్లెదుటకు..

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్. ఉత్తమ పర్యాటక ప్రాంతం అవార్డు. పిల్లలు, పెద్దల ఆహ్లాదాన్ని పంచుతున్న డైనోసార్ పార్క్. నిరుద్యోగులకు ధైర్యం నింపిన ఐటీ టవర్స్.

వివరాలు 10లో ▸



తొమ్మిది జీపీలకు ప్రతిపాదనలు

బీఆర్ఎస్ హయాంలో ఆరు పంచాయతీలకు ప్రతిపాదించగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిదింటికి ప్రతిపాదించింది.

వివరాలు 10లో ▸



సర్వర్ తిప్పలు

సర్వర్ సరిగా పని చేయకపోవడంతో ఈ కేవైసీ నమోదుకు వచ్చిన గ్యాస్ వినియోగదారులు నానా అవస్థలుపడ్డారు. ఈ కేవైసీ నమోదుకు గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి వచ్చారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

అర్హులు దరఖాస్తు చేసుకోండి

డీఆర్డీఓ శ్రీనివాస్



అంతారంలో దరఖాస్తులు తీసుకుంటున్న డీఆర్డీఓ శ్రీనివాస్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ పథకాలకు అర్హులు ప్రజాపాలన దరఖాస్తు ఫారం అధికారులకు అందజేయాలని డీఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని అంతారం, ఫైజాబాద్ గ్రామాలలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు ఇచ్చే సమయంలో ఏవైనా సందేహాలు ఉంటే అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముసాద్దిక్, ఎంపీడీఓ శశిప్రభ, సర్పంచ్‌లు అశోక్‌గౌడ్, మనోహర, ఏఎస్ఓ వెంకటేశ్, కార్యదర్శులు రవిశంకర్, నాగరాజు, ఏఈఓలు రమ్య, భూపాల్, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనవరి 6 లోపు దరఖాస్తు చేయాలి

నర్సాపూర్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ జనరల్ గురుకులాల్లో చేరాలనుకునే విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసేందుకు జనవరి 6 లోపు దరఖాస్తు చేయాలని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి గిరిజన కాలేజీలు, పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్, స్థానిక ఎస్టీ గురుకులం ప్రిన్సిపాల్ భిక్షమయ్య శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో చేరగోరే విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుందని, ఇందుకు జనవరి 6 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11 తేదీన జరుగుతుందన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న దేవయ్య

చేగుంట(తూప్రాన్): అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నట్లు మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దేవయ్య శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి నిర్వహించిన 25వ స్నాతకోత్సవంలో యూజీసీ చైర్మన్ ఆచార్య జగదీష్‌కుమార్, వీసీ సీతారామారావు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయ విద్యలో సమాజ భాగస్వామ్యం అంశంపై డీన్ ఫ్యాకల్టీ చంద్రకళ ఆధ్వర్యంలో పరిశోధన చేసినట్లు తెలిపారు. పరిశోధనలో మార్గదర్శకులుగా పదాల లక్ష్మణ్ సహకరించినట్లు తెలిపారు. దేవయ్యకు డాక్టరేట్ పట్టా రావడంపై డీఈఓ రాధాకిషన్, ఎంఈఓ బుచ్యా నాయక్, రెడ్డిపల్లి హెచ్ఎం గంగాబాయి, సర్పంచ్ లక్ష్మిజ్ఞానేశ్వర్ అభినందించారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద



మెదక్: శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద శుక్రవారం తెలిపారు. మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కక్షిదారులు రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

త్వరలో ఉపాధి శిక్షణ తరగతులు

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి శిక్షణ తరగతులు త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు శుక్రవారం తెలిపారు. తెలంగాణ యువజన సర్వీసుల శాఖ వారిచే వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిర్వహించే 7వ బ్యాచ్ శిక్షణ తరగతులకు ఆసక్తిగల నిరుద్యోగులు జనవరి 2వ తేదీలోగా దరఖాస్తు అందజేయాలన్నారు. ప్రతీ కోర్సులో ఒక బ్యాచ్‌కు 30 మంది ఉంటారని తెలిపారు. 3 నెలల శిక్షణ కాలం ఉంటుందని, శిక్షణ పూర్తయ్యాక ప్రభుత్వ సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు కేంద్రం ఇన్‌చార్జి పి.మనిషాను (73963 13741) సంప్రదించాలన్నారు.

అక్కడ నష్టం.. ఇక్కడ లాభం

ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం సన్నబియ్యానికి బహిరంగ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. క్వింటాల్ బియ్యానికి రూ.5,700 నుంచి 6,500 వరకు ధర పలుకుతోంది. ఇందుకు ప్రధానం కారణం ఏపీలో తుపాన్ కారణంగా పంటలు దెబ్బతినటమేనని పలువురు చెబుతున్నారు.

సన్నబియ్యానికి డిమాండ్
- క్వింటాల్ ధర రూ.5,700 నుంచి 6,500
- ఏపీలో తుపాన్ కారణంగా దెబ్బతిన వరి పంట
- క్వింటాల్ సన్న ధాన్యం రూ.2,700 కొనుగోలు
- రైతుకు లభించిన మద్దతు ధర



మెదక్: ఈ ఏడాది జిల్లాలో వ్యాప్తంగా 3.45 లక్షల ఎకరాల్లో వివిధ రకాల వరి పంటలను సాగు చేశారు. అందులో 50 వేల పైచిలుకు ఎకరాలలో సన్నరకాలు సాగుచేశారు. వీటిని బియ్యం వ్యాపారులు, రైస్‌మిల్లర్లు గ్రామాలకు వచ్చి క్వింటాల్ రూ. 2,600 నుంచి రూ. 2,700కు కొనుగోలు చేస్తున్నారు. అదే కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాల్ ధాన్యానికి రూ. 2,203 చొప్పున ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఉండగా, సన్న ధాన్యానికి మరో వంద తక్కువే ఇస్తున్నారు. అంటే క్వింటాల్‌కు రూ.2,103 చొప్పున ఇస్తున్నారు. అయితే బయటి వ్యాపారులు రూ.2,700 చొప్పున నగదు చెల్లిస్తున్నారు.

యాసంగిలోనూ..

వర్షాకాలంలో సాగుచేసిన సన్న ధాన్యానికి బహిరంగ మార్కెట్లో మంచి లాభాలు రావటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత రబీలోనూ సన్నరకాలను అధికంగా సాగుచేస్తున్నారు. సాధారణంగా సన్నాలను వర్షాకాలంలోనే సాగు చేస్తారు. కానీ, మార్కెట్లో మంచి ధర పలకడంతో రబీలోనూ సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దొడ్డురకం వరి పంటతో పోల్చితే సన్నరకం పంట 20 రోజుల ఆలస్యంగా చేతికందుతుంది. ఇందుకు పుష్కలంగా నీరు అవసరం. జిల్లాలోని ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు ఘనాపూర్ ప్రాజెక్టు పరిధి హల్దీ ప్రాజెక్టు, జిల్లాలో అతి పెద్ద చెరువైన కోంటూర్ ఆయకట్టు తదితర ప్రాంతాల్లో ఈ సన్నరకాలను సాగు చేస్తున్నారు. ఈ సన్నరకాల్లో సైతం మంచి క్వాలిటీ బీపీటీకి ఎక్కువ డిమాండ్ ఉంది. ఈసారి బీపీటీ బియ్యం మార్కెట్లో క్వింటాల్‌కు 6,500 పలుకుతోంది. అదే ఏడాది పాటు నిల్వఉన్న బియ్యం రూ.7 వేల వరకు ధర ఉందని బియ్యం వ్యాపారులు చెబుతున్నారు.

మంచిలాభాలు వచ్చాయి



నాకున్న మూడున్నర ఎకరాలలో సన్న రకం ఆమని వరి పంటను సాగు చేశాను. 110 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ధాన్యం వ్యాపారి క్వింటాల్‌కు రూ. 2,700 చొప్పున చెల్లించి తీసుకెళ్లాడు. ఈలెక్కన ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరతో పోల్చుకుంటే క్వింటాల్ రూ. 500 అదనంగా వచ్చింది. ఎప్పుడూ లేని విధంగా వ్యాపారులు ఇంటికి వచ్చి నగదు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఈసారి కూడా సన్న బియ్యం సాగు చేస్తా.

– సంజీవరెడ్డి రైతు జంగరాయి

అలక్ష్యం చేస్తే అనర్హత



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

- గడువులోగా ఎన్నికల ఖర్చు నివేదిక
- కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల ఏజెంట్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ హాజరై అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు, వ్యత్యాసాలపై పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలు నెలలోపు సమర్పించాలన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లకు ఖర్చుల వివరాలు సమర్పించేలా ఏఈఓలు మార్గనిర్దేశం చేస్తున్నారని చెప్పారు. ఎన్నికల ఖర్చుల వివరాలు సకాలంలో సమర్పించని పక్షంలో వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. నిర్ణీత కాల వ్యవధి లోపు స్పందించని వారిపై ఆర్పీ చట్టం 1951లోని సెక్షన్ 10ఏ ప్రకారం అనర్హత విధించాలని కోరుతూ ఎలక్షన్ కమిషన్‌కు లేఖ పంపడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈసీ అనర్హులుగా ప్రకటిస్తే మూడేళ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కోల్పోతారన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి, జిల్లా ఆడిట్ అధికారి రాకేష్, ఈడీఎం సందీప్, ఏజెంట్లు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనకు ప్రజాపాలన

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

పాపన్నపేట(మెదక్): అవినీతి నిర్మూలనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఐదు గ్యారంటీలను ప్రజాపాలన కార్యక్రమం ద్వారా నెరవేరుస్తామన్నారు. అర్హులైన మహిళలకు ఫించన్‌లు ఇస్తామన్నారు. అధికారులు గ్రామాలకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అనంతరం 46 మందికి కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోవింద్, జిల్లా కాంగ్రెస్ రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కో ఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపీటీసీలు శ్రీనివాస్, రమేష్, ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలి

మెదక్ కలెక్టరేట్: యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చూడాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో మెదక్ నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ, అటవీశాఖ, ఎక్సైజ్ శాఖ, మైనింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారారని, ఇకపై వాటికి బానిసలు కాకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. నిషేధిత మత్తు పదార్థాలైన అల్ప్రాజోలం, గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టాలన్నారు. పరిశ్రమలు, ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలలో స్థానిక యువతకే ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మైనింగ్ ఏడీ జయరాజు, డీఎఫ్ఓ రవిప్రసాద్, మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, నియోజకవర్గ పరిధిలోని అటవీశాఖ, రెవెన్యూ శాఖ, ఎక్సైజ్ శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రైతుబంధు విడుదల చేయాలి



గూడూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: రైతుబంధుతోపాటు వరి బోనస్ రైతుల ఖాతాలలో వెంటనే జమ చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధి 3వ వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలనలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు సూచించారు. ప్రజాపాలనలో చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యేకు కమిషనర్ వివరించారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోనస్ చెల్లించాలి

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ఇస్తామన్న వరి బోనస్ రూ.500 చెల్లించాలని ఎమ్మెల్యే సునితా రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల పరిధి గూడూర్ గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, ఎంపీడీఓ భారతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రామిరెడ్డి, వైస్‌చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ స్వరాజ్యలక్ష్మీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు యాదగౌడ్, మహేందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, నర్సయ్య, యదగిరి, తదితరులు ఉన్నారు.

బీవీఆర్ఐటీలో టై గ్రేడ్ ప్లస్ కిక్ ఆఫ్



ఒప్పంద పత్రాలు చూపుతున్న దృశ్యం

నర్సాపూర్‌రూరల్: నర్సాపూర్ బీవీఆర్ఐటీలో టైగ్రేడ్ ప్లస్ కిక్ ఆఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్నోవేషన్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించేందుకు టై హైదరాబాద్, బీవీఆర్ఐటీల మధ్య అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది. కార్యక్రమంలో టై గ్రేడ్ ప్రోగ్రాం చైర్ భాను ప్రకాష్ వర్మ, వివేక్ వర్మ, డాక్టర్ నందిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కల్గించొద్దు



తూప్రాన్‌లో ఆరు గ్యారంటీల దరఖాస్తును పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి సంగీత

జిల్లా నోడల్ అధికారి సంగీత

చేగుంట(తూప్రాన్): ప్రజలకు ఇబ్బంది లేకుండా దరఖాస్తులు తీసుకోవాలని ప్రజాపాలన జిల్లా నోడల్ అధికారి సంగీత అన్నారు. మండలంలోని పులిమామిడి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న విధానాన్ని కౌంటర్ల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు తీసుకునే సమయంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. దరఖాస్తుదారుల పేర్లు ఉన్న రేషన్ కార్డు జిరాక్స్ సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, తహసీల్దార్ గియాసున్నీసాబేగం, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, ప్రజాపాలన మండల టీం సభ్యులు పాల్గొన్నారు.


తూప్రాన్: అభయ హస్తం ఆరు గ్యారంటీల దరఖాస్తులను ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా స్వీకరించేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా ప్రత్యేక అధికారి సంగీత పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ రమేశ్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రజల ఇబ్బందులు, అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవడంలో ప్రజలు ఇబ్బందిపడకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునేవారు, గతంలో మైనర్‌గా ఉన్న కుటుంబ రేషన్‌కార్డులో పేరు నమోదై ఉన్నవారు దరఖాస్తుకు అర్హులన్నారు. కుటుంబంలో అర్హులు ఎంత మంది ఉన్నా వారికి దరఖాస్తు ఫారాలు అందజేస్తామన్నారు. కుటుంబానికి ఒక దరఖాస్తు అనే పుకార్లను నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జయచందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ ఖాజా మొహినొద్దీన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న జాతర పనులకు పాతర

- మల్లన్న ఆలయంలో వసతులు కరువు
- భక్తులకు తప్పని తిప్పలు
- వసతి గదుల నిర్మాణంలోనూ తీవ్ర జాప్యం
- సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం
- నామ్‌కేవాస్తేగా సమీక్షలు



నత్తనడకన సాగుతున్న 50 గదుల నిర్మాణ పనులు



స్వామి వారి కల్యాణం నిర్వహించే తోటబావి ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ అందె శ్రీనివాస్‌రావు



శిథిలావస్థలో ఆలయ వసతి గదులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఓ వైపు జాతర ముంచుకొస్తున్నా అధికారుల్లో చలనం కానరావడంలేదు. ప్రతి యేట స్వామి వారి కల్యాణం, బ్రహ్మోత్సవాలకు (జాతర) లక్షలాది భక్తులు వస్తుంటారు. దీంతో ఆలయ ఆదాయం బాగా పెరిగినా అభివృద్ధి మాత్రం జరగడంలేదు. భక్తులకు వసతుల కల్పన, అభివృద్ధి పనులు చేస్తామని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నా కార్యరూపం దాల్చడంలేదు. ప్రతి సంవత్సరం స్వామి కల్యాణం బ్రహ్మోత్సవాలకు ముందు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం.. ఆ తరువాత విస్మరించడం పరిపాటిగా మారింది.

7న స్వామివారి కల్యాణం..

స్వామివారి కల్యాణం జనవరి 7న జరగనుండడంతో ఆలయంలోని పనులు ఇంత వరకు పూర్తికాలేదు. దీంతో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలాలేవని పలువురు వాపోతున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ , మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలి వస్తారు. సరియైన వసతులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురువుతున్నారు. గతంలో ఆలయం పరిధిలో దాతలు నిర్మించిన వసతి గదులు 140 ఉండగా అందుతో 20 గదులు శిథిలావస్థలో ఉన్నాయి. 30 గదులు ఆలయ అవసరాలకు, 10 గదులు ఆలయంలో నిర్మాణ పనులు చేస్తున్న కూలీలకు కేటాయించారు. ప్రస్తుతం 80 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆలయ వసతి గదులు లభించక పోవడంతో ప్రయివేటు అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు. భక్తుల ఇబ్బందులు తగ్గించేందుకు 2018 బండగుట్టపై 50 గదుల నిర్మాణం ప్రారంభించారు. ఐదేళ్లు అవుతున్నా వాటి నిర్మాణం పూర్తి కాకపోవడం గమనార్హం. నిర్మిస్తున్న సమయంలోనే స్లాబ్ పెచ్చులూడుతండటంతో అధికారుల నిర్లక్ష్యం, పనుల నాసిరకానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు. అవే కాకుండా ఆలయంలో నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్, త్రిశూలం ఢమరుకం పనులు నత్తనడక సాగుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన వసతి గదుల నిర్మాణం పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

విశ్వబ్రాహ్మణులకు చోటు కల్పించాలి

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న మల్లన్న కల్యాణం, జాతర నిర్వహణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నియమించనున్న మల్లన్న ఆలయ దర్మకర్తల కమిటీలో విశ్వబ్రాహ్మణులకు చోటు కల్పించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ సంఘం రాష్ట్ర కార్యదర్శి వజ్రోజు శంకరాచారి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయ దర్మకర్తల మండలిలో విశ్వబ్రాహ్మణ కులానికి డైరెక్టర్ పదవులు ఇవ్వాలన్నారు. ఐదు కులాలు ఉన్న విశ్వ బ్రాహ్మణులకు చోటు కల్పించి గుర్తించాలని కోరారు.

కల్యాణం ఏర్పాట్లపై పరిశీలన

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అదనపు డీసీపీ(అడ్మిన్) అందె శ్రీనివాస్ రావు స్థానిక పోలీసులకు సూచించారు. శుక్రవారం హుస్నాబాద్ ఏసీపీ సతీష్‌తో కలసి స్వామి కల్యాణం నిర్వహించే తోటబావి ప్రాంగణంతో పాటు వీఐపీ పార్కింగ్, శీఘ్ర దర్శనం , వీఐపీ దర్శనం, సాధారణ దర్శన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ప్రసన్నకుమార్, చేర్యాల సీఐ సత్యానారాయణరెడ్డి, ట్రాఫిక్ సీఐలు రామకృష్ణ, తిరుపతి, స్థానిక ఎస్ఐ నాగరాజులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాను చనిపోతూ.. పలువురికి వెలుగునిస్తూ..

- రోడ్డు ప్రమాదంలో .. బ్రెయిన్‌ డెడ్‌తో వ్యక్తి మృతి


బీరప్ప

రాయికోడ్‌(అందోల్‌): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి బ్రెయిన్‌ డెడ్‌తో మృతిచెందాడు. తాను చనిపోతూ అవయవదానం చేసి పలువురి జీవితాల్లో వెలుగులు నింపాడు. ఈ సంఘటన రోయికోడ్‌ మండల పరిధిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం.. రాయిపల్లికి చెందిన బి.బీరప్ప (28) ఓ ప్రైవేటు పైనాన్స్‌ కంపెనీలో ఉద్యోగి. అతను మూడురోజుల క్రితం జహీరాబాద్‌కు ఓ పని నిమిత్తం బైక్‌ తీసుకొని బయలుదేరాడు. మార్గమధ్యలో ఝరాసంగం మండలం కుడిసంగం సమీపం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం జహీరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌ జూబ్లీహిల్స్‌లో ఉన్న అపోలోలో చేర్పించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌ డెడ్‌గా నిర్ధారించారు. అతడి అవయవాలను దానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలపై కుటుంబీకులకు అవగాహన కల్పించారు. దీనికి వారు ఒప్పుకోగా బీరప్ప లీవర్‌, కిడ్నీలను ఇతర పేషంట్లకు అమర్చుతున్నట్లు డాక్టర్లు చెప్పినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు.

నడుచుకుంటూ వెళ్తుండగా...

- బైక్‌ ఢీకొని వ్యక్తి..

శివ్వంపేట(నర్సాపూర్‌): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండల పరిధి తాళ్లపల్లి తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... తాళ్లపల్లి తండాకు చెందినవాడు కోలా రాజు(32). అతను గురువారం రాత్రి పక్కనున్న ఓ తండాలో జరుగుతున్న వేడుకకు హాజరై ఇంటికి తిరిగి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఎదురుగా బైక్‌ పై వచ్చిన వ్యక్తి, అతడిని ఢీ కొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన తండా వాసులు, కుటుంబ సభ్యులు నర్సాపూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతను అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు చెప్పారు.

రైతును కాటేసిన కరెంట్‌ తీగ


శ్రీనివాస్‌ (ఫైల్‌)

సిద్దిపేటఅర్బన్‌: అడవి పందుల బారి నుంచి చేనును రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన కరెంట్‌ తీగ ఓ రైతును బలిగొంది. ఈ సంఘటన సిద్దిపేట అర్బన్‌ మండలం కిష్టసాగర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తొడంగల శ్రీనివాస్‌ (45) శుక్రవారం ఉదయం తమ పంట పొలం వద్ద ఒడ్డు చెక్కుతుండగా, మరో రైతు అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌ వైరు అతడి చేతికి తాకింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇది గమనించిన అతడి భార్య పెద్దగా కేకలు వేసింది. ఈ అరుపులను విని అదే గ్రామానికి చెందిన మహేష్‌ రక్షించేందుకు వచ్చి తనకూ తీగ తగిలి కరెంట్‌ షాక్‌కు గురై కింద పడ్డాడు. దీంతో అక్కడే ఉన్న కొంతమంది కలిసి వెంటనే తీగను తొలగించగా ప్రాణాలతో బయటపడ్డాడు. శ్రీనివాస్‌ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్‌ పోలీసులు తెలిపారు.

కల.. కళ్లెదుటకు..

దశాబ్దాల కల నెరవేరింది. ఈ రైలు ఏర్పాటుతో ప్రజల్లో సంతోషం నింపింది. అదే సిద్దిపేట- సికింద్రాబాద్‌ రైలు. ఇవాళ సిద్దిపేట జిల్లాకు మణిమకుటంగా నిలుస్తోంది. దీంతో పాటు జిల్లా ఇంకా ఎంతో అభివృద్ధిని సాధించింది. డైనోసార్‌ పార్క్‌, ఐటీ టవర్స్‌, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అంతేనా? ఉత్తమ పర్యాటక ప్రాంతం అవార్డు పొందడం ఈ ప్రాంత అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది. 2023 సంవత్సరం ఎన్నో మధురాను భూతులను జిల్లా వాసులకు మిగిల్చింది. ఈ విషయాలను మననం చేసుకుంటూ కథనం.

- సాక్షి, సిద్దిపేట



సిద్దిపేట - సికింద్రాబాద్‌ రైలు

- సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌ రైలు అందుకు తార్కాణం
- 17 ఐటీ కంపెనీలు ఏర్పాటు 700 మందికి ఉపాధి
- అభివృద్ధికి కేరాఫ్‌ అడ్రస్‌గా సిద్దిపేట

ఫుడ్‌ సేఫ్టీ అండ్‌ స్టాండర్డ్స్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

ఫిబ్రవరిలో సిద్దిపేట, గజ్వేల్‌ ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్లకు జాతీయ ఫుడ్‌ సేఫ్టీ అండ్‌ స్టాండర్డ్స్‌ గుర్తింపు వచ్చింది. దేశంలోనే మొదటి, రెండో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ గుర్తింపు సిద్దిపేట, గజ్వేల్‌లు పొందాయి. అలాగే సిద్దిపేట ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌కు ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ సైతం సాధించింది.



ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ గుర్తింపు పొందిన ఇంటిగ్రేటెడ్‌ మార్కెట్‌

• మరిచిపోనిరోజు అక్టోబర్‌ 3

మనోహరాబాద్‌ నుంచి సిద్దిపేటకు రైల్వే ట్రాక్‌ను రూ. 1,200 కోట్లతో నిర్మించారు. సిద్దిపేట నుంచి సికింద్రాబాద్‌కు అక్టోబర్‌ 3వ తేదీ నుంచి రైలు ప్రారంభమైంది. జిల్లా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రోజుకు రెండు ట్రిప్పులు సికింద్రాబాద్‌–సిద్దిపేట రాకపోకలు జరుగుతున్నాయి. రైలు రాకతో జిల్లా మరింత పారిశ్రామికంగా అభివృద్ధిలో ముందుకు సాగుతోంది.


సిద్దిపేటకు రైలును ప్రారంభిస్తున్న హరీశ్‌ రావు(ఫైల్‌)

• యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు

సిద్దిపేటలో ఐటీ టవర్‌ను రూ.62 కోట్లతో నిర్మించారు. జూన్‌ 16న హరీశ్‌ రావుతో కలిసి అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ ప్రారంభించారు. దీంతో సాఫ్ట్‌వేర్‌ రంగం సిద్దిపేట వైపు మళ్లింది. ఇప్పటి వరకు 17 కంపెనీలు ఏర్పాటయ్యాయి. స్థానిక నిరుద్యోగ యువతకు 700 మందికి ఐటీ ఉద్యోగాలు లభించాయి. రెండు షిఫ్ట్‌ల్లో ఐటీ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.


ఐటీ హబ్‌ను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు, కేటీఆర్‌(ఫైల్‌)

ఉత్తమ అవార్డు చంద్లాపూర్‌ సొంతం



సెప్టెంబర్‌ 25న జాతీయ ఉత్తమ పర్యాటక ప్రాంతంగా చిన్నకోడూరు మండలంలోని చంద్లాపూర్‌ ఎంపికైంది. ఇదే గ్రామంలో శ్రీరంగనాయకసాగర్‌, రంగనాయక దేవాలయం ఉండటంతో రోజు వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. దీంతో జాతీయ స్థాయిలో ఈ గ్రామానికి గుర్తింపు వచ్చింది. ఈ అవార్డును కేంద్ర పర్యాటక శాఖ మంత్రి అజయ్‌ భట్‌ చేతుల మీదుగా సర్పంచ్‌ చంద్రకళ, అడిషనల్‌ కలెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి అందుకున్నారు.

మరిన్ని అభివృద్ధి పనులు

- కోమటి చెరువు సమీపంలో రూ.12 కోట్లతో నిర్మించిన డైనోసార్‌ పార్క్‌ను సెప్టెంబర్‌ 17న ప్రారంభించారు. కదులుతున్న డైనోసార్‌లను చూస్తూ పిల్లలు, పెద్దలు ఎంతో ఎంజాయ్‌ చేస్తున్నారు.
- జూన్‌ 13న ఆర్‌అండ్‌ బీ, పంచాయతీ రాజ్‌ ఇంజినీరింగ్‌ సర్కిల్‌ కార్యాలయాలు ప్రారంభమయ్యాయి. దీంతో రూ.50 లక్షలకు పైగా పనులకు సైతం అగ్రిమెంట్‌లు, టెండర్లు సిద్దిపేట నుంచే పిలుస్తున్నారు. దీంతో పనులు మరింత వేగం పెరిగేందుకు దోహదపడుతుంది.
- సిద్దిపేట సేంద్రియ ఎరువును మార్కెట్‌లోకి ఫిబ్రవరి 21న విడుదల చేశారు. సిద్దిపేట పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించే తడి చెత్తతో సీఎన్‌జీ గ్యాస్‌ తయారు చేస్తున్నారు. మిగిలిన మిశ్రమంతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఈ సేంద్రియ ఎరువును రైతులు పంట పొలాల్లో వినియోగిస్తున్నారు.
- ఫిబ్రవరి 4న హుస్నాబాద్‌, గజ్వేల్‌ ఏసీపీ కార్యాలయాలు, గౌరారం సర్కిల్‌, ములుగు, సిద్దిపేట టూ టౌన్‌, త్రీ టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ల నిర్మాణం కోసం రూ.27.87 కోట్లు మంజూరయ్యాయి.
- జనవరి 3న స్నేహిత మహిళా సపోర్ట్‌ సెంటర్‌ను ప్రారంభించారు. వేధింపులకు గురైన బాధితులకు, బాధిత కుటుంబ సభ్యులకు 816 మందికి కౌన్సెలింగ్‌ ఇచ్చారు.


కొండపోచమ్మను సందర్శిస్తున్న పంజాబ్‌ సీఎం భగవత్‌సింగ్‌ మాన్‌(ఫైల్‌)

ఆకర్షిస్తున్న ప్రాజెక్టులు

స్టడీ టూర్‌లకు కేరాఫ్‌ అడ్రస్‌గా సిద్దిపేట, గజ్వేల్‌ నిలిచింది. జిల్లాలో నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్‌, రంగనాయకసాగర్‌, కొండపోచమ్మ సాగర్‌లు ఇతర రాష్ట్రాల వారిని అమితంగా ఆకర్షిస్తున్నాయి. ఫిబ్రవరి 16న పంజాబ్‌ ముఖ్యమంత్రి భగవత్‌ సింగ్‌ మాన్‌తో పాటు పలువురు మంత్రులు, ఏప్రిల్‌ 11న మహారాష్ట్ర నుంచి రైతులు, ఏప్రిల్‌ 15న జాతీయ మీడియా ప్రతినిధులు సందర్శించి సాగు, తాగునీరును ఎలా ప్రజలకు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్‌ 27న అరుణాచల్‌ ప్రదేశ్‌కు చెందిన ప్రజాప్రతినిధులు మర్కూక్‌లోని ఎర్రవెల్లి గ్రామాన్ని, మార్చి 3న రాజస్థాన్‌కు చెందిన ఇరిగేషన్‌ అధికారులు, మార్చి 1న నారాయణరావు మండలం గుర్రాలగొంది గ్రామాన్ని పంజాబ్‌కు చెందిన అధికారులు సందర్శించారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న అదనపు డీసీపీ మల్లారెడ్డి

అదనపు డీసీపీ (లా అండ్‌ ఆర్డర్‌) మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్‌: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని సిద్దిపేట అదనపు డీసీపీ (లా అండ్‌ ఆర్డర్‌) మల్లారెడ్డి అన్నారు. ఆపరేషన్‌ స్మైల్‌ నిర్వహణ గురించి సీపీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లలోపు బాలబాలికలు ఎవరైనా వెట్టి చాకిరికి గురైతే వారిని గుర్తించి కౌన్సెలింగ్‌ నిర్వహించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. బాలబాలికలతో వెట్టి చాకిరి, భిక్షాటన చేయించినా, పనిలో పెట్టుకున్నా చర్యలు తప్పవన్నారు. సిద్దిపేట, గజ్వేల్‌, హుస్నాబాద్‌ మూడు డివిజన్‌లలో అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. బాలకార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు గుర్తిస్తే డయల్‌ 100 లేదా సిద్దిపేట పోలీసు కంట్రోల్‌ రూం 8712667100కు సమాచారం అందించాలని సూచించారు. ఆపరేషన్‌ స్మైల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో మహిళ పోలీసు స్టేషన్‌ సీఐ దుర్గ, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌ గురుస్వామి, అసిస్టెంట్‌ లేబర్‌ ఆఫీసర్‌ వికార్‌బాబా, ఏసీడీపీఓ మమత, సీడబ్ల్యూసీ మెంబర్‌ బాల్‌చంద్రం, వివిధ శాఖల అధికారులు స్వామి, కనకరాజు, రేష్మబేగం, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు


కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌

మెదక్‌ ఎమ్మెల్యే రోహిత్‌

చిన్నశంకరంపేట(మెదక్‌): పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని మెదక్‌ ఎమ్మెల్యే రోహిత్‌ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మేలు చేసేందుకే ప్రజాపాలన ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందనున్నయని తెలిపారు. గతంలో లాగా పార్టీ కార్యకర్తలకు కాకుండా అర్హులు ఏ పార్టీ వారున్నా.. లబ్ధి చేకూరనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌ మహేందర్‌గౌడ్‌, జెడ్పీటీసీ మాధవి రాజు, సర్పంచ్‌ రాజిరెడ్డి, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్‌): మండల కేంద్రంలో శుక్రవారం మెదక్‌ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, జెడ్పీటీసీ విజయ్‌ కుమార్‌, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అమరసేనారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు బాల్‌ నర్సవ్వ, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ బాల్‌రెడ్డి, భాగలక్ష్మి, కాంగ్రెస్‌ నాయకులు మారుతి, వెంకటేశ్‌గౌడ్‌, అజయ్‌, వివిధ నాయకులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

జోగిపేట(అందోల్‌): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.7792 కోట్ల స్కాలర్‌షిప్‌, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్‌ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. ఆరేళ్లుగా బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేసిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్కాలర్‌షిప్‌ పెంచాలని కోరారు. అలాగే సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెస్‌, కాస్మొటిక్‌ చార్జీలు పెంచాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో శేఖర్‌, రాజు, వికాస్‌, గోపాల్‌, చరణ్‌ ఉన్నారు.

సమస్యలు పరిష్కారించాలి

జోగిపేట(అందోల్‌): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని అందోల్‌ ప్రెస్‌క్లబ్‌ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రిడేషన్‌ ఉన్న జర్నలిస్టులందరికీ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జోగిపేట ఎంపీపీ కార్యాలయ ఆవరణలో నిర్మించిన రీడింగ్‌ రూంకు అదనపు సౌకర్యాల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని కోరారు.

9 మందికి జీవిత ఖైదు

మహిళ హత్య కేసులో సంగారెడ్డి కోర్టు తీర్పు

జహీరాబాద్‌ టౌన్‌: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌ మండలం కాశీంపూర్‌లో జరిగిన ఓ మహిళా హత్య కేసులో 9 మందికి జీవిత ఖైదు, ఒక్కొక్కరికి ఐదు వేల జరిమాన విధిస్తూ జిల్లా అదనపు సెషన్స్‌ జడ్జి గన్నారపు సుదర్శన్‌ శుక్రవారం తీర్పు ఇచ్చారు. చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్‌ కథనం ప్రకారం.. కాశీంపూర్‌కు చెందిన వడ్ల నర్సమ్మ తన కొడుకుతో కలిసి జహీరాబాద్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటుంది. ఆమె బంధువులైన వడ్ల వీరన్న కూతురి పెళ్లి కుదిరింది. బాల్య వివాహం చేస్తున్నారన్న ఫిర్యాదుతో అధికారులు వెళ్లి ఆ పెళ్లిని ఆపించారు. జహీరాబాద్‌లో ఉంటున్న నర్సమ్మ ఉద్దేశ పూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేయించి తన కూతురి పెళ్లిని ఆపించిందని వీరన్న కక్ష పెంచుకున్నాడు. పింఛన్‌ డబ్బు కోసమని 2016 మార్చి 25న ఆమె జహీరాబాద్‌ నుంచి కాశీంపూర్‌కు వెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న అతడు ఇదే అదనుగా భావించి బంధువులైన వడ్ల ప్రభు(40), వడ్ల ప్రశాంత్‌(19), వడ్ల వెంకట్‌(19), వడ్ల సంతోష్‌(19), వడ్ల రేఖ(28), వడ్ల ప్రభావతి(40), వడ్ల ఈశ్వరమ్మ(42), వడ్ల శ్రీకాంత్‌(17)తో కలిసి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆమె జహీరాబాద్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నర్సమ్మ కుమారుడు వడ్ల పాండు ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ సదానాగరాజు, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజశేఖర్‌ కేసును దర్యాప్తు చేసి కోర్టుకు సమర్పించారు. ఇరువైపుల వాదనలు విన్న కోర్టు.. నిందితులకు పై శిక్ష విధించింది. జరిమాన చెల్లించడంలో విఫలమైతే ఒక సంవత్సరం సాధారణ శిక్షతో పాటు రూ. 500 జరిమాన చెల్లించాలని న్యాయమూర్తి సుదర్శన్‌ తీర్పు ఇచ్చారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన చిరాగ్‌పల్లి, జహీరాబాద్‌ పోలీసులను ఎస్పీ చెన్నూరి రూపేష్‌ అభినందించారు.

కడుపునొప్పి తాళలేక వివాహిత ఆత్మహత్య

జిన్నారం(పటాన్‌చెరు): కడుపు నొప్పి భరించలేక వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గుమ్మడిదల మండలంలోని అన్నారంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన బోయిని సాగర్‌, కవిత భార్యాభర్తలు. మూడు రోజుల క్రితం దంపతులిద్దరూ పిల్లలతో కలిసి తిరుపతికి వెళ్లారు. అక్కడ రాత్రి ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రాగా భరించలేక ఉరివేసుకుంది. సాగర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

ప్రయివేట్‌ ఆస్పత్రి సీజ్‌

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కందిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రయివేటు ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారులు సీజ్‌ చేశారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అనవసరపు వైద్య పరీక్షలు, అర్హతలేని వైద్యులతో చికిత్సలు, నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రిని నడిపిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆస్పత్రిని సీజ్‌ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

తొమ్మిది జీపీలకు ప్రతిపాదనలు

బీఆర్‌ఎస్‌ హయాంలో ఆరు పంచాయతీలకు ప్రతిపాదించగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వం తొమ్మిదింటిని ప్రతిపాదించింది. అందులో దాస్‌తండా, రామవరం గ్రామ పరిధిలో బంగారులొద్ది తండా జీపీల ఏర్పాటుకు ప్రతిపాదించకపోవడంతో ఈ తండా వాసులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. ఇదీ అక్కన్నపేట మండలం పరిస్థితి.

- మంత్రి ఆదేశాలు మేరకు వివరాల అందజేత



అక్కన్నపేట మండల ప్రజాపరిషత్‌ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ఈ మండలంలో నూతనంగా తొమ్మిది గ్రామపంచాయతీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. 500 మంది జనాభా దాటిన ఆవాస ప్రాంతాలు, తండాలను కొత్త జీపీలుగా గుర్తించదగినవి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ఆదేశాలను ఇచ్చారు. దీంతో తొమ్మిదింటిని జీపీలుగా ప్రతిపాదిస్తూ ఆయనకు పూర్తి వివరాలను అందజేశామని కాంగ్రెస్‌ అక్కన్నపేట మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య అందజేశారు.

జీపీలివే..

''గౌరవెల్లి క్రాస్‌ వద్ద నివాసం ఉంటున్న కాలనీ తెనుగుపల్లి జీపీ. నందారం స్టేజీ వద్ద పునరావాస కాలనీ(జాలుబాయి తండా, సోమాజీ తండా) బంగారులొద్ది తండాలను కలుపుతూ గుడాటిపల్లి పేరుగా జీపీ. కుందనవానిపల్లి క్రాస్‌ వద్ద సేవ్యనాయక్‌ తండాను బంజార హిల్స్‌ తండా పేరుతో జీపీ. అంతక్కపేట గ్రామ పరిధిలోని చిన్నగుబ్బడి పేరుతో జీపీ. కుందనవానిపల్లి గ్రామ పరిధిలో చౌటకుంట, సీతారాం తండాలను కలుపుతూ చౌటకుంట తండాగా జీపీ. గండిపల్లి గ్రామ పరిధిలో పంచరాయితండా, డాక్యానాయక్‌తండా అంబనాయక్‌తండాలను కలుపుతూ హాతీరాం మహారాజ్‌తండా పేరుతో జీపీ. అలాగే బోరింగ్‌తండా, దెక్యనాయక్‌తండాలను కలుపుతూ సరిరాంతండా జీపీ. పోతారం(జే) గ్రామ పరిధిలో తుర్కనవానిపల్లి పేరుతో జీపీ, అక్కన్నపేట గ్రామ పరిధిలో చౌడుతండా జీపీగా ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసి మంత్రి పొన్నంకు అందజేశామని అయిలయ్య తెలిపారు.

- బీఆర్‌ఎస్‌ హయాంలో 6 జీపీలుగా ప్రతిపాదనలు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో అక్కన్నపేట మండలంలో ఆరు కొత్త జీపీలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలో రావడంతో ఇటీవల నూతన మండలాలు, కొత్త జీపీల ఏర్పాటు పై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల అధికారుల ద్వారా వివరాలను ప్రభుత్వం కోరింది. దీంతో వారు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం హయాంలో ప్రతిపాదించిన ఆరు జీపీల పేర్లను మళ్లీ కాంగ్రెస్‌ ప్రభుత్వానికి ఇచ్చినట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అన్నారు.

గందరగోళంలో ప్రజలు

గత ప్రభుత్వ హయాంలో దుబ్బతండా గ్రామ పరిధిలో దాస్‌తండా, రామవరం గ్రామ పరిధిలో బంగారులొద్దితండాలు నూతన జీపీలుగా ఏర్పాటుకు ప్రతిపాదించారు. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వం మాత్రం ఈ తండాల పేర్లను జీపీల ఏర్పాటుకు ప్రతిపాదించకపోవడంతో ప్రజలు గందరగోళంలో పడ్డారు. ఏదిఏమైనా ఈ తండాల వైపు మంత్రి పొన్నం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

చిన్నశంకరంపేట(మెదక్‌): గుర్తు తెలియని మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో గుర్తించిన సంఘటన నార్సింగి మండలం వల్లూర్‌ అటవీ ప్రాంతంలో జరిగింది. పశువుల కాపరులు ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, నార్సింగి ఎస్‌ఐ అహ్మద్‌ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే క్లూస్‌ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. శరీర భాగాలు ఎక్కడికక్కడా వేరు కావడంతో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను పిలిపించి ఇక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం క్లూస్‌ టీం సేకరించిన ఆధారాల ప్రకారం మృతురాలి వయస్సు సుమారు 29 నుంచి 35 ఏళ్ల వరకు ఉంటుంది. ఎత్తు 5.2 నుంచి 5.4 అడుగుల ఎత్తు ఉంటుంది. పింక్‌ కలర్‌ చీర, జాకెట్‌ ధరించి ఉంది. కళ్లజోడు, చేతికి గాజులు కూడా ఉన్నాయి. అయితే కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం బట్టి నెల రోజుల క్రితమే మరణించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు నార్సింగి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహిళను ఇక్కడే హత్య చేశారా? లేక ఎక్కడో చేసి తీసుకొచ్చి మృతదేహాన్ని ఇక్కడ పడేశారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. కానీ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అహ్మద్‌ తెలిపారు.